ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జనవరి 9 : తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో అడ్మిషన్లు, 7 నుంచి 10వ తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. http://telanganams.cgg.govv.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ హాల్ టికెట్ల డౌన్‌లోడ్, 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని సూచించారు. జిల్లాలో ఆరు ఆదర్శ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.

భూగర్భ జలాల వృద్ధికి చర్యలు

సౌత్ క్యాంపస్‌లో బోరు బావిలో నీరు ఎంత లోతులో ఉందో పరిశీలిస్తున్న భూగర్భ జల అధికారి సతీశ్ యాదవ్

భిక్కనూరు, జనవరి 9: మండలంలోని టీయూ సౌత్ క్యాంపస్‌లో భూగర్భ జలాల వృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలను జిల్లా భూగర్భ జలశాఖ అధికారి ఎం సంతోష్ యాదవ్ మంగళవారం వివరించారు. ఈ మేరకు ఆయన సౌత్ క్యాంపస్‌లో ఇంకుడు గుంతలు, మినీ పెర్కోలేషన్ ట్యాంకులను నిర్మించే ప్రదేశాలను గుర్తించారు. ఆయన వెంట ఎంపీడీవో అనంతరావు, ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, ప్రతిజ్ఞ, హాస్టల్ వార్డెన్ యలాద్రి, ఎస్ నారాయణగుప్తా తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడం అభినందనీయం

బాన్సువాడ టౌన్, జనవరి 9 : ప్రైవేట్ కంపెనీలు పట్టణంలోని ప్రభుత్వ కళాశాలకు వచ్చి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ కంపెనీ కొత్తగా చేపట్టిన టెక్ బీ ప్రోగ్రాం కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళాను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగాల కోసం పట్టణాల, కంపెనీల చుట్టూ తిరగకుండా కళాశాలకు వచ్చి అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసినందుకు హెచ్‌సీఎల్ సంస్థ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం కోసం ఎంపికైన 10 మంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ, అధ్యాపకులు జలీల్, హఫీజ్, యాదగౌడ్, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ప్రదర్శన
- భారీగా తరలివచ్చిన జనం

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మంగళవారం మల్లన్న జాతర ఉత్సవాలు కొనసాగాయి. భక్తులు ఉదయం నుంచి ఆలయంలో బోనాలు, ఒడిబియ్యం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలరులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

-కామారెడ్డి, జనవరి 9

డాటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలి

అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో భుజంగరావు

పిట్లం/బాన్సువాడ/బాన్సువాడ టౌన్/బీబీపేట్/దోమకొండ, జనవరి 9 : ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదేశించారు. పిట్లం తహసీల్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాటా ఎంట్రీ విధానంపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తు వివరాలను సమగ్రంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్, ఎంపీవో బ్రహ్మం, నాయబ్ తహసీల్దార్ నరేశ్, గిర్దావర్ శీతల్, తహసీల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు శ్రీనివాస్, కౌన్సిలర్లు హకీం, నర్సగోండ, మున్సిపల్ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు ఉన్నారు. బీబీపేట్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీని ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నిజాంసాగర్‌లో చేపడుతున్న ప్రజాపాలన డాటా ఎంట్రీ తీరును ఎంపీడీవో నాగేశ్వర్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 17వ తేదీలోపు వంద శాతం ఎంట్రీ పూర్తిచేస్తామని, అందుకోసం ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించామని అన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

నస్రుల్లాబాద్, జనవరి 9 : బీర్కూర్ మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్, పంటలపై డ్రోన్‌తో పిచికారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శివకుమార్, ఆరోగ్య సిబ్బంది వినోద్, పద్మలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నారం గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

మాచారెడ్డి, జనవరి 9 : వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు వెంటనే చెల్లించాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనాదారులతో మాట్లాడారు. పెండింగ్ చలాన్లపై ప్రభుత్వం రాయితీ అందిస్తున్నదని చెప్పారు. ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉన్నదని, వాహనాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చలాన్లు చెల్లించాలని సూచించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

భిక్కనూరు/పెద్దకొడప్‌గల్/ బీబీపేట్, జనవరి 9 : భిక్కనూరు టోల్ గేట్ వద్ద ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. నిబంధనలు పాటించని వాహనదా రులకు ఫైన్ విధించారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజని చౌరస్తా వద్ద 161 జాతీయ రహదారిపై ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. బీబీపేట్ మండలంలోని జనగామ, శ్రీగాధ రోడ్డులో ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని 30 మంది వాహనదారులకు జరిమానా విధించారు. రాజేంద్ర ప్రసాద్, శంకర్, అనిల్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెలఫోన్ల అందజేత

నిజాంసాగర్/సదాశివనగర్/రామారెడ్డి, జనవరి 9: జుక్కల్ మండలం పెద్ద గుల్లాకు చెందిన సంతోష్ గత నెల 25న తన సెలఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి మంగళవారం అందజేశారు. సదాశివనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశామని ఎస్సై రాజు తెలిపారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే పూర్తి సమాచారంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బి.నవీన్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందజేశామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

బకాయి ఫీజులను వెంటనే చెల్లించాలి

కామారెడ్డి, జనవరి 9 : విద్యార్థులకు బోధనా ఫీజులు మంజూరు కాలేదని, బకాయి ఉన్న ఫీజులు వెంటనే చెల్లించాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోతే ఆందోళన చేస్తామని అన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి చెల్లించాల్సిన సుమారు రూ.3,250 కోట్లలో 1,250 కోట్లకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు ట్రెజరీకి పంపి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు డబ్బులు విడుదల కాలేదన్నారు. జిల్లా కార్యదర్శి సంతోష్, రాజేందర్, ప్రభాకర్, నవీన్, చారి, శ్రీధర్, దయాకర్, మహేశ్ పాల్గొన్నారు.

మైలారంలో వైద్య శిబిరం

నస్రుల్లాబాద్, జనవరి 9 : బాన్సువాడలోని సెవెన్‌హిల్స్ దవాఖాన సహకారంతో మండలంలోని మైలారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్లు అవినాష్, మమత, వాగ్దేవి, మాజీ ఎంపీటీసీ మహేందర్ పాల్గొన్నారు.

లెదర్‌పార్క్ కోసం స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 9: లెదర్ పార్క్ కోసం ఎల్లారెడ్డి పట్టణ శివారులో గతంలో కేటాయించిన స్థలాన్ని లెదర్ పార్క్ కార్పొరేషన్ అధికారులు మంగళవారం పరిశీలించారు. గతంలో నేరెళ్ల ఆంజనేయులు మంత్రిగా ఉన్నప్పుడు లెదర్ పార్క్ ఏర్పాటు కోసం పట్టణ శివారులోని 1406 సర్వే నంబర్‌లో 25 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. స్థలం కేటాయించి ఏండ్లు గడుస్తున్నా అక్కడ ఎలాంటి పనులు ప్రారంభించలేదు. దీంతో స్థలాన్ని పలు ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. కాగా.. స్థలాన్ని తమకు అప్పగించాలని కార్పొరేషన్ అధికారులు ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, గిర్దావర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే

నిజాంసాగర్, జనవరి 9: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మంగళవారం సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేటివ్, చేనేత, టెక్స్‌టైల్స్ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును వేర్వేరుగా కలిసి మాట్లాడారు. గాంధీభవన్‌లో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

దవాఖాన తనిఖీ

రామారెడ్డి, జనవరి 9: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దవాఖానలోని రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. దవాఖాన ఆవరణలో నాటడానికి మొక్కలను ఇప్పించాలని డాక్టర్ సురేశ్‌కుమార్ ఎంపీపీని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. నాయకులు శ్యాం, కుమార్‌చారి ఉన్నారు.

బడిబయటి బాలిక గుర్తింపు

బాలికను పాఠశాలలో చేర్పిస్తున్న నీఆర్పీ

నిజాంసాగర్, జనవరి 9: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లిలో నీఆర్పీ వరలక్ష్మి మంగళవారం బడిబయటి పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుబ్బురి సవిత అనే బాలిక బడి మానేసి ఇంటి వద్ద ఉంటున్నట్లు గుర్తించారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆమెను నిజాంసాగర్ కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ సరోజన ఆధ్వర్యంలో 8వ తరగతిలో చేర్పించారు.

నాయబ్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

నిజాంసాగర్, జనవరి 9: జుక్కల్ మండల నాయబ్ తహసీల్దార్‌గా సత్యనారాయణ బాధ్యతలను స్వీకరించారు. ఆయనను స్థానిక నాయకులు వినోద్, విఠల్‌రావు పటేల్ తదితరులు మంగళవారం కలిసి సన్మానించారు. మండల ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని కోరారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలి

సదాశివనగర్, జనవరి 9: అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు టీచర్ శశిరేఖ పోషకాహారాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు.

ఆర్థిక సహాయం అందజేత

సహాయం అందజేస్తున్న వారధి స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

పిట్లం, జనవరి 9: మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి బాన్సువాడలోని వారధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొంత నగదు, నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోపాల్‌సింగ్, ఉపాధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి వై.గోపాల్, సభ్యులు సాయిలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

పిట్లం, జనవరి 9: మండలకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం ఎదుట మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆటో యూనియన్ పిట్లం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.సాయిలు, ఉపాధ్యక్షులుగా నరేశ్, గణేశ్, కార్యదర్శిగా కె.సాయిలు, కోశాధికారిగా గఫూర్, కార్యదర్శిగా సలీం, పాశం నారాయణ, సంయుక్త కార్యదర్శిగా రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి దీనంగా మారిందని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న ఆటో డ్రైవర్లు

క్యాలెండర్ల ఆవిష్కరణ

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

కామారెడ్డి/ బాన్సువాడ టౌన్/ ఎల్లారెడ్డి రూరల్/ నిజాంసాగర్, జనవరి 9 : కామారెడ్డిలోని తన కార్యాలయంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ తెలంగాణ 2024 నూతన క్యాలెండర్‌ను డీఈవో రాజు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ జిల్లా అధ్యక్షుడు నార్ల అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్ శిక్షక్, కార్యదర్శి మంత్రి మధుసూదన్, లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ కోటదుర్గమ్మ ఆలయ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పత్తి శ్రీకాంత్, ఉప్పరి లింగమేశ్వర్, మహేందర్, శ్రీనివాస్, సంతోష్, కాశీనాథ్, డాక్టర్ శివకుమార్, పద్మ, నరేశ్, రవికుమార్, ఆలయం ప్రధాన పూజారి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర కాలమానిని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రూప్‌సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, గణపతి, కృష్ణమూర్తి, బలరాం, రాజశేఖర్, కృష్ణ, రమేశ్ తదితరులున్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు రూప్‌సింగ్ ఆధ్వర్యంలో నిజాంసాగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం, 317 జీవోను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, గణపతి, బలరాం, రాజశేఖర్, కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★JAGARAMPALLI SANTHOSH (Old name) H.No.1-44/3, Vill: Palem, Mdl: Morthad, Dist. Nizamabad, T.S., Hence changed my name as JAGURAMPALLY SANTHOSH REDDY (new name)

NTZ-324506

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న, క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: మండలంలోని కాటేపల్లిలో యువకులు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని ఎంపీడీవో రాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. ఈనెల 16వ తేదీ వరకు టోర్నీ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎంపీవో సూర్యకాంత్, సర్పంచ్ విఠల్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

సదాశివనగర్, జనవరి 9: సంక్రాంతి పండుగ సందర్భంగా మర్కల్‌లోని మహిళా గురుకుల డిగ్రీ కాలేజీలో మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేసి రంగులు నింపారు. అందంగా వేసి ముగ్గులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోరు మోటర్లు ప్రారంభం

ఎల్లారెడ్డి, జనవరి 9: నాగిరెడ్డిపేట మండలంలోని బెజగం చెరువు తండాలో జడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటరును జడ్పీటీసీ మనోహర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. స్థానిక నాయకులు హరిలాల్ నాయక్, కిషన్ నాయక్, వీరు సేట్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయం వద్ద..

నిజాంసాగర్, జనవరి 9: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని బీరప్ప ఆలయం వద్ద బోరు డ్రిల్లింగ్ పనులను సొసైటీ చైర్మన్ వాజిద్‌అలీ, విజయ్, మాజీ సర్పంచ్ కాశయ్య, మహేందర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ మంజూరు చేసిన నిధులతో బోరు మోటరును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామాగౌడ్, ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, కుర్మ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

బోరుమోటరును ప్రారంభిస్తున్న నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

అన్నాసాగర్‌లో..

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 9: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్‌లో జడ్పీ నిధులతో ఏర్పాటుచేసిన రెండు బోరు మోటర్లను సర్పంచ్ పెరుగు నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బాల్‌రాజ్, కారోబార్ సంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బేగంపూర్‌లో అక్షింతల పంపిణీ

ఇంటింటికీ అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ

పెద్ద కొడప్‌గల్/ బీబీపేట, జనవరి 9: అయోధ్య పూజిత అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద కొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ తండాలో శనివారం పంపిణీ చేశారు. తండాలోని దుర్గాభవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శివురాం, బజరంగ్ దళ్ కార్యకర్తలు, తండావాసులు పాల్గొన్నారు. బీబీపేటతోపాటు జనగామ, మాందాపూర్, యాడారం, తుజాల్‌పూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్ తదితర గ్రామాల్లో అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. 22న ఐదు దీపాలను వెలిగించాలని సూచించారు.